# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 13-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మహా కుంభ్-2025 ఉత్తరప్రదేశ్ ప్రయాగ్ రాజ్‌లో ఈరోజు ప్రారంభమైంది.**
2. **సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.**
3. **తెలుగు సంప్రదాయాలను సంక్రాంతి పండుగ ప్రతిబింపచేస్తుందని కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు.**
4. **శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని కొత్తపేట కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
5. **ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా అన్నారు.**

============================

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం ఉత్తరప్రదేశ్ మహా కుంభ్ ఈరోజు ప్రయాగ్‌రాజ్‌లో పుష్య పూర్ణిమ సందర్భంగా అమృత్ స్నాన్‌తో ప్రారంభమైంది. లక్షలాది మంది భక్తులు, యాత్రికులు, సందర్శకులు గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం అయిన త్రివేణి సంగమంలోని వివిధ ఘాట్‌లలో పవిత్ర స్నానాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 26వ తేదీ మహాశివరాత్రి వరకు ఈ మహోత్సవం కొనసాగనుంది.

కాగా భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు భద్రత కల్పించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. నదిలో నిరంతరం పహారా కాసేందుకు ప్రత్యేకంగా తేలియాడే పోలీసుస్టేషన్‌ను ఏర్పాటుచేశారు. సమాచారం, నివాసం, పారిశుద్ధ్యం వంటి అంశాలలో పటిష్ట చర్యలను చేపట్టింది. ప్రయాగ్ రాజ్‌కు చేరుకునేందుకు రైల్వే శాఖ దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజని కుంభమేళా ప్రారంభం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. మన దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు ..., పట్టణాలు .... గ్రామాలు సంక్రాంతి పండుగ శోభను సంతరించుకున్నాయి. భోగి పండుగను ఈ రోజు ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. పట్టణాల నుండి పల్లెలకు చేరిన

వారంతా వేకువజామున లేచి భోగి మంటలు వేశారు. మామిడి తోరణాలు ..., గొబ్బిల్లతో తీర్చిదిద్దిన రంగవల్లులు ..., ఇళ్ల ముందుకు వచ్చిన డూ డూ బసవన్నహరిదాసుల భజనలు ..., బంధు మిత్రుల రాకలతో ఇళ్ల లోగిళ్ళు సందడిగా ఉన్నాయి. కాగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి కుటుంబాలలో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి కుటుంబాలలో భోగ భాగ్యాలు నింపాలని కోరుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు భోగి పండుగ వేడుకలలో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నారావారిపల్లిలో సంక్రాంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు క్రీడా పోటీలను, మహిళల ముగ్గుల పోటీలను ముఖ్యమంత్రి తిలకించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారావారిపల్లెలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన సిమెంట్ రహదారిని ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అదే విధంగా విద్యుత్ సబ్ స్టేషన్, ఎ.రంగంపేటలోని ఉన్నత పాఠశాలలో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డిజిటల్ తరగతి గదుల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.

---------------------------

తెలుగు సంప్రదాయాలను సంక్రాంతి పండుగ ప్రతిబింబిస్తుందని కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం వెంప గ్రామం లో జరిగిన భోగి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. సంక్రాంతి పండుగ అన్ని వయసుల వారు సంతోషంగా జరుపుకొనే పండుగని తెలియజేస్తూ...

...వాయిస్... 33 సెకన్లు

---------------------------

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని కొత్తపేట కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కొండపైన 4 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రహదారి పనులకు నిన్న ఆయన శంకుస్థాపన చేశారు. నిర్ణీత సమయంలో రహదారి నిర్మాణాన్ని పూర్తిచేస్తామని మంత్రి తెలిపారు. కొండపై పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కోనసీమలో సంక్రాంతి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరుతో డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో పడవ పోటీలను నిన్న ఏర్పాటు చేసింది. ఈ పోటీలకు పలు జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులతో కూడిన 11 జట్లు హాజరయ్యాయి. బొబ్బర్లంక ప్రధాన కాలువలో వెయ్యి మీటర్ల పరిధిలో ఈ

పోటీలు నిర్వహించారు. ఈరోజు ఈత, డ్రాగన్ పడవ పోటీలకు సంబంధించి 100 మీటర్ల సెమీ ఫైనల్స్, ఫైనల్స్ జరగనున్నాయి.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకుంటున్నారని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో జరిగిన సంక్రాంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం పెంచిన పెన్షన్ తో పాటు, అన్నక్యాంటీన్లు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి సొంత ఊర్లకి ప్రజలు తరలి రావటం చాలా సంతోషమని పేర్కొంటూ...

..వాయిస్...16 సెకన్లు

---------------------------

సంక్రాంతి సెలవులకు స్వస్థలాలకు వెళ్లే ప్రయాణీకుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు విజయవాడ ఆర్టీసీ జోన్ ఈడీ జి.విజయరత్నం తెలియచేశారు. ప్రయాణికుల సౌకర్యార్ధం నిన్న ఏలూరుకు నాలుగు ప్రైవేటు పాఠశాలల బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విశాఖపట్నానికి – 10, రాజమండ్రికి – 62, రావులపాలేనికి – 12, భద్రాచలానికి – 4, అమలాపురానికి – 10, ఏలూరుకు – 11, అవనికు – 5, కాకినాడకు – 2, తిరుపతికి – 2 బస్సులను నడిపినట్లు ఆయన పేర్కొన్నారు.

---------------------------

ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో అధిక ఛార్జీల వసూలు, వివిధ రకాల నియమాల ఉల్లంఘనలకు సంబంధించి 553 కేసులు నమోదు చేశామని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 10 బస్సులను సీజ్ చేశామని వివరించారు. 91 లక్షల రూపాయలు జరిమానా విధించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రవాణాశాఖ కార్యాలయంలో నోడల్ అధికారిని నియమించామని, ఛార్జీల పెంపు, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంపై ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీతో సమన్వయం చేసుకుంటూ అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు.

---------------------------

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు కృషితో బొబ్బిలి ప్రాంతానికి రెండు భారీ పరిశ్రమలు రాబోతున్నాయని బొబ్బిలి నియోజకవర్గ శాసన సభ్యులు రంగారావు అన్నారు. బొబ్బిలిలో పాత్రికేయుల సమావేశంలో నిన్న ఆయన మాట్లాడుతూ... పట్టణానికి సువర్ణముఖి నది నుంచి నీటిని తీసుకువచ్చే పథకాన్ని మంత్రి పి. నారాయణ ప్రారంభించారని త్వరలో పనులు జరుగుతాయని చెప్పారు. తోటపల్లి నుంచి తాగునీటిని వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి అందజేస్తామన్నారు.

=====================